
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సూర్యాపేట

5 మంగళవారం 8 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 24.0

'ధరణి'లో లోపం.. వారికి వరం

» ఆపరేటర్ ద్వారా డబ్బులు వసూలు » ఇబ్బందులు పడుతున్న రైతులు

ధరణి పోర్టల్‌లో లోపాలు అధికారులకు వరంగా మారాయి. గత బీఆర్ఎస్ ప్రభు త్వం ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. దాని ద్వారా అనేకమంది వీఆర్‌వోల సహకారంతో పోర్ట ల్‌లో తమకు భూమి లేనప్పటికీ నమోదు చే సుకున్నారు. వీఆర్‌వోలకు అంతోఇంతో ముట్ట చెప్పి అప్పటి నుంచి రైతుబంధు పొందు తూనే ఉన్నారు. కేవలం 10 గుంటలు ఉన్న ఒక వ్యక్తికి 10 ఎకరాలు ఉన్నట్లుగా కూడా నమోదైంది. కొంతమంది రైతులకు 20 ఎక రాలు ఉంటే నాలుగు ఎకరాలు మాత్ర మే నమోదైంది. ఒక సర్వే నెంబర్‌లో 30 ఎక రాలు ఉండాల్సి ఉండగా 40 నుంచి 50 ఎక రాలు కూడా నమోదైంది. ప్రతీ ఊరిలో 100 ఎకరాలు అధికంగా నమోదైనట్లు తెలు స్తోంది. ఇలాంటి తప్పులు అధికారుల మామూళ్ల వసూలుకు ఆసరాగా మారాయి.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)



ధరణి నిబంధనల మేరకు స్లాట్‌బుక్ చేసు కుంటే అధికారులు రిజిస్ట్రేషన్ చేయాల్సిందే. ఒక కుటుంబంలో తల్లిదండ్రులు చనిపోతే వారికున్న నలుగురు సంతానంలో ఎవరు ముందుగా స్లాట్‌బుక్ చేసుకుంటే వారి పేరు మీదే రిజిస్ట్రేషన్ చేసి పాస్‌బుక్‌లు అందజేస్తు న్నారు. కొన్ని మండలాల్లో ప్రతి రోజూ 6 నుం చి 7 రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా నూతనకల్, మద్దిరాల, మేళ్లచెర్వు, చింతలపాలెంలో ఒక్కో రోజు రిజిస్ట్రేషన్లు కూడా ఉండటం లేదు. మొత్తం మీద ప్రతిరోజూ జిల్లాలో 100 నుంచి 110 దాకా రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. సర్వే నెంబర్ తప్పుపడ్డా, బ్యాంకులో పాస్‌బుక్ ఉంటే ఎకరానికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వర కు డిమాండ్ చేస్తున్నారు. ధరణి ఆపరేటర్ల ద్వారానే కొంతమంది తహసీల్దార్లు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ధరణి ఆపరేటర్లు సరిగా నమోదు చేయకపోవ డంతో కూడా రైతులు ఇబ్బందులు పడుతున్నా రు. అప్పటి వీఆర్‌వోలు చేసిన తప్పిదాల మూలం గా కొంతమంది రైతులకు...

- మిగతా 8వ పేజీలో...



సూర్యాపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులపై కప్పిన పట్టాలు(పాతచిత్రం)

సిబ్బంది కొరతతో ఇబ్బంది

» ఒక్కో సీసీకి 8 కేంద్రాల కేటాయింపు

» దూర ప్రాంతాల్లో ఉండటంతో కొరవడిన పర్యవేక్షణ

» ఏఈవోలకూ తప్పని పనిఒత్తిడి

» తరుగు పేరుతో దోపిడీ

యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఒక్కో కేంద్రానికి కమ్యూనిటీ కోఆర్డినేటర్ల(సీసీ)లను ఇన్‌చార్జిగా నియమించారు. వసతుల ఏర్పాటుతో పాటు కొనుగోళ్లలో ఏ తప్పు జరిగినా వీరిపైనే వేటుపడుతుంది.అయితే ఒక్కో సీసీకి ఎనిమిది కేంద్రాల వరకు ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నారు. ఆయా కేంద్రాలు దూరంగా ఉండటం, ఒత్తిడి పెరగడంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఇబ్బందిగా మారుతోంది. దీంతో మౌలిక వసతుల లేమితో పాటు ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఎవరు తప్పు చేసినా వేటు మాత్రం సీసీపైనే పడుతుంది.

- (ఆంధ్రజ్యోతి-భానుపురి)

యాసంగి సీజన్‌లో కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలను విక్రయించడానికి రైతులు నానాతంటాలు పడే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినా సరైన సిబ్బంది లేక ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. జిల్లాలో సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకు సెంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. మొత్తం 286 సెంటర్లను ఏర్పాటు చేస్తుండగా అందులో 74 సన్నరకం ధాన్యం కొనగోలుకు, 212 దొడ్డు రకం ధాన్యం కొనుగోలు నిర్ణయించారు. జిల్లాలో 4.85 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 12 లక్షల మెట్రిక్‌టన్నులు ధాన్యం రావచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అందులో 4 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు దొడ్డు ధాన్యం, సన్నాలు మరో 2లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రాలకు రావచ్చని అధికారులు చెబుతున్నారు. మిగతా 6 లక్షల ధాన్యం మిల్లులకు నేరుగా వెళ్లే అవకాశం ఉంటుందంటున్నారు.

286 సెంటర్లకు 41 మందే

జిల్లాలో సన్న,దొడ్డు రకాల కొనుగోలకు సంబంధించి మొత్తం 41 మంది మాత్రమే కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ఉన్నారు. వీరికి తోడు 82 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు. సీసీలు ఒక్కొక్కరికి 6 నుంచి 8 సెంటర్లు కేటాయించాల్సి వస్తోంది. ఏఈవోలకు 3 నుంచి 4 కేంద్రాలు కేటాయించడంతో కొనుగోళ్లలో సంఘబంధం నిర్వాహకులే కీలకమవుతున్నారు.

ఇవీ బాధ్యతలు

కొనుగోలు సెంటర్‌లో సీసీలు...

- మిగతా 8వ పేజీలో...

తుంగతుర్తిలో 16 కేంద్రాలకు ఒక్కడే

జిల్లాలో కొన్ని మండలాల్లో సీసీలపై తీవ్ర పనిఒత్తిడి ఉంది. తుంగతుర్తి మండలంలో 16 కేంద్రాలకు ఒక్కడే సీసీ కాగా, అర్వపల్లిలో 13 కేంద్రాలకే ఒక్కడు బాధ్యతలు చూస్తున్నారు. చివ్వెంల మండలంలో 18 కేంద్రాలకు ఇద్దరు, నాగారం 9 కేంద్రాలకు ఒక్కడు చూస్తున్నారు. సిబ్బంది సరిపడా లేకపోవడంతో ఎక్కువ సెంటర్లను కేటాయిస్తున్నారు. దీంతో మానిటరింగ్‌కు ఇబ్బంది కలుగుతున్నట్లు సీసీలు చెబుతున్నారు. కొన్నిచోట్ల కేంద్రాలు దూరందూరంగా ఉండటంతో ఒక రోజులో రెండు, మూడు కేంద్రాలకు మించి చూడలేని పరిస్థితి నెలకొంటుంది. దీంతో ఏ అక్రమాల చోటు చేసుకున్నా సీసీలు బాధ్యులు కావాల్సి రావడంతో పాటు రైతులు నష్టపోవాల్సి వస్తోంది.



దోపిడీకి గురవుతున్న రైతులు

జిల్లాలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు దోపీడీకి గురవుతున్నారు. తేమశాతం ఎక్కువగా ఉందని మిల్లర్లు సాకులు చెబుతూ క్వింటాళ్ల కొద్దీ ధాన్యం తరుగు చూపిస్తూ రైతులను నష్టపరుస్తున్నారు. కేంద్రాల నుంచి ధాన్యం లారీల్లో ఎగుమతి చేసుకున్న తర్వాత కూడా తరుగు సాకు చూపిస్తున్నారు. కొన్ని మండలాల్లో మండల స్థాయి అధికారి నుంచి సంఘబంధం నిర్వాహకుల వరకు మిల్లర్లతో కుమ్మక్కై తరుగు తీస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సెంటర్లలో మౌలిక వసతులు సైతం సక్రమంగా ఏర్పాటుచేయడం మరిచిపోతున్నారు. రైతులు చేసేదేమీ లేక కాంటాలు అయితే చాలుఅన్నట్లుగా ఉంటున్నారు. రైతుల వద్ద నుంచి పురుకోసలు, బస్తాల ఖర్చులు తీసుకుంటున్నా అడిగేవారులేరు.

మాతాశిశు మరణాలను తగ్గించాలి



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే మాతాశిశు మరణాలను తగ్గించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. గర్భిణులు సరైన చికిత్స, పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వవచ్చన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ ఏడాది మూడు లక్షల మాతృ మరణాలు, 20 లక్షల నవజాత శిశు మరణాలు జరుగుతున్నాయన్నారు. వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందుతున్నా మాతాశిశు మరణాలు బాధ కలిగిస్తున్నాయన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యం సామాజిక ఆర్థికాభివృద్ధికి ముడిపడిఉందన్నారు. ఆరోగ్యం, మంచి అలవాట్లు, చెడు అలవాట్లపై ప్రజలకు అవగాహన పెరిగేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లోని అన్నిశాఖల ఉద్యోగుల కోసం కలెక్టరేట్‌లో హెల్త్ క్యాంపు నిర్వహించి అందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కోటా చలం, జిల్లా వైద్య ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌పై నిషేధాన్ని అమలు చేయాలి

సూర్యాపేట(కలెక్టరేట్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్‌పై నిషేధాన్ని అన్నిశాఖలు పక్కాగా అమలుచేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను తీసుకున్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్లాస్టిక్‌వాడకంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. పర్యావరణం కలుషితం కావడంతో మనుషులతో పాటు వన్యప్రాణులకు ప్రమాదం నెలకొందన్నారు. ప్రజావాణిలో ఆరు అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరించాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో చలివేంద్రాల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో అప్పారావు, డీఎఫ్‌వో సతీష్‌కుమార్, సీపీవో కిషన్, డీఎంహెచ్‌వో డాక్టర్ చలం, డీఏవో శ్రీధర్‌రెడ్డి, పరిశ్రమల శాఖాధికారి సీతారాంనాయక్, మత్స్యశాఖాధికారి నాగులునాయక్, జిల్లా సంక్షేమాధికారులు లత, శంకర్, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాసనాయక్, డీసీవో పద్మ, ఏవో సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌యూవీ'ని సద్వినియోగం చేసుకోవాలి



సూర్యాపేట(కలెక్టరేట్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం (ఆర్‌యూవీ) పథకాన్ని జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీకి చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా రూ.4లక్షల వరకు రుణం పొందవచ్చన్నారు. రూ.50 వేల రుణమైతే 100 శాతం, రూ.లక్ష లోపు 90శాతం, రూ.2లక్షల వరకు 80శాతం, రూ.4 లక్షల వరకు 70శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. వ్యవసాయేతర పథకాలకు సంబంధించిన యూనిట్లకు అయితే అభ్యర్థుల వయస్సు 21ఏళ్ల నుంచి 55ఏళ్ల వరకు, వ్యవసాయ ఆధారిత యూనిట్లు అయితే 21 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో అయితే కుటుంబ వార్షికాదాయం రూ.లక్షన్నర, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.2 లక్షల వరకు ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగులు అయితే సదరం సర్టిఫికెట్, పాస్‌పోర్టు ఫొటో, రవాణా రంగానికి అయితే డ్రైవింగ్ లైసెన్సు, వ్యవసాయ రంగానికి అయితే పట్టాదారు పాస్‌బుక్, విద్యార్హత సర్టిఫికెట్లు జత చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు ఈ నెల 14వ తేదీ లోపు గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు మండల పరిషత్ కార్యాలయాల్లో, పట్టణ ప్రాంత అభ్యర్థులు మునిసిపల్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో వైద్యసిబ్బందిదే కీలకపాత్ర



సదస్సులో మాట్లాడుతున్న న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి పీ శ్రీవాణి

సూర్యాపేట లీగల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలదే కీలకపాత్రని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పీ శ్రీవాణి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రాజీవ్‌నగర్‌లోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో ఏఎన్‌ఎంలకు, ఆశావర్కర్లకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన శిబిరంలో మాట్లాడారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, చెట్లు నాటడంపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపెల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, గుంటూరు మధు, అల్లమనేని వెంకటేశ్వర్‌రావు, నల్లపాటి మమత, బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు జే శశిధర్, రమాదేవి పాల్గొన్నారు.

మార్కెట్‌కు 42వేల బస్తాల ఉత్పత్తుల రాక

భానుపురి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం భారీగా ధాన్యం వచ్చింది. ధాన్యంతో పాటు అపరాలు వచ్చాయి. అన్ని వ్యవసాయ ఉత్పత్తులు కలిపి 42,326 బస్తాలు వచ్చాయని అధికారులు తెలిపారు. దీంట్లో ధాన్యం 40,930 బస్తాలు రాగా అందులో జైశ్రీరాం, ఐఆర్-64 రకం, హెచ్‌ఎంటీ రకం ఎక్కువగా ఉన్నాయి. జైశ్రీరాం 25,318 బస్తాలు, ఐఆర్-64 రకం 9,812, హెచ్‌ఎంటీ 5,364, ఆర్‌ఎన్‌ఆర్ 20, బీపీటీ 301, జైశ్రీరాం పాతవి 115 బస్తాలు వచ్చాయి. కందులు 98, పెసర 848, వేరుశనగ 148, మినుములు 5, మొక్కజొన్న 180, బొబ్బర్లు 117 బస్తాలు వచ్చాయి. మద్దతు ధర కంటే తక్కువగానే ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోయవద్దు: ఎస్పీ



సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయవద్దని, దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం రోడ్లపై ఆరబోయడం వల్ల వాహనదారులు గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఈ ప్రమాదాల్లో వాహనదారుల ప్రాణాలు పోతున్నాయని, గతేడాది చివ్వెంల నుంచి వట్టిఖమ్మంపహాడ్ వైపు వెళ్తున్న వాహనదారుడు ధాన్యాన్ని గమనించకపోవడంతో ప్రమాదానికి గురై మృతి చెందినట్లు గుర్తుచేశారు. దీంతో పాటు తుంగతుర్తి మండలంలోని వెలుగుపల్లి వద్ద రాత్రి సమయంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందినట్లు పేర్కొన్నారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. రైతులు పోలీసుల సూచనను పాటించి రోడ్లపై ధాన్యం పోయకుండా ఉండాలన్నారు.

ప్రతీ ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం



మద్దిరాల మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్

మద్దిరాల,ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం మద్దిరాల మండలం రెడ్డిగూడెం, పోలుమళ్ల గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఏవో అనిషారోహి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధాకిషన్‌రావు, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు, నాయకులు పచ్చిపాల సుమతివెంకన్నమల్లయ్య పాల్గొన్నారు.

నూతనకల్ : ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతామని ఎమ్మెల్యే సామేలు అన్నారు. మండలంలోని బక్కహేమ్లతండాలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధాసుధాకర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో సునీత, ఏపీఎం రమణాకర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సామేలు కోరారు. మండలంలోని వెలుగుపల్లి,తుంగతుర్తి, సింగారంతండా గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి ...

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలకేంద్రంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీని ప్రారంభించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. ప్రపంచ దేశాలకు దిక్సూచిగా నిలిచిన భారత రాజ్యాంగాన్ని కేంద్రంలోని బీజేపీ విచ్ఛిన్నం చేయడానికి కుట్ర పన్నుతోందన్నారు. ఆయా కార్యక్రమాల్లో తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పీసీసీ సభ్యులు గుడిపాటి నరసయ్య, జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ, మండల పార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ యాత్ర మండల కోఆర్డినేటర్ మాచర్ల అనిల్, నాయకులు ఉన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఏవో శ్రీధర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎస్),ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కందగట్ల, మంగల్‌తండాలలో రైతు ఉత్పత్తిదారుల సేవా సంఘం దొడ్డు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. తేమ శాతం తక్కువగా ఉండేలా రైతులు చూడాలన్నారు. ఏపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆత్మకూర్(ఎస్) మండలకేంద్రంలో దొడ్డు, సన్నాలు, నెమ్మికల్ గ్రామంలో దొడ్డు, రామోజాతండాలో దొడ్డు, రామన్నగూడెం, మిద్దనపల్లి గ్రామాలల్లో దొడ్డు వడ్ల కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ హరికిశోర్‌శర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో దివ్య, ఏఈవో శివకుమార్, శంకర్, వెంకన్న, మోహన్‌రెడ్డి, భద్రాచారి, రైతులు పాల్గొన్నారు.

మండే @ 37



సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం ఎండలు మండిపోయాయి. ఉదయం 7 గంటల నుంచే భానుడి ప్రతాపం కనిపించింది. సోమవారం 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అదేవిధంగా రెండు రోజులుగా 35 డిగ్రీలపైనే ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు ఎండ వేడి నుంచి ఉపశమనానికి శీతలపానీయాలు, కొబ్బరినీళ్లు, పళ్ల రసాలు, ఐక్రీమ్‌లు, నిమ్మకాయ సోడా బండ్లను ఆశ్రయించారు. మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని పలు రహదారులు జనసంచారం అంతగా లేకుండా ఉంది. సాయంత్రం ఆరు గంటల వరకు వేడి వాతావరణం కనిపించింది.

ఆటాడుకుందాం

శారీరక, మానసిక వికాసంలో ఆటలకు ఉన్న ప్రాధాన్యం ఎంతో గొప్పది. పూర్వీకుల నుంచి ఆటల పట్ల ఉన్న ఆ ప్రాధాన్యం మాటల్లో చెప్పలేనిది. రేడియో, టెలివిజన్ వంటి వినోద సాధనాలు రాకముందు వినోదం, మానసిక చురుకుదనం, ఐక్యమత్యం, పట్టుదల, స్నేహ సంబంధాలతో పాటు ఆరోగ్యం, ఆనందానికి ఆటలు ప్రేరకాలుగా ఉండేవి. అందుబాటులో ఉన్న వస్తువులు, పరికరాలతో ఆట వస్తువులను తయారుచేసుకుని ఆడటం పూర్వపు రోజుల్లో కనిపించేవి. గ్రామాల్లో తీరిక వేళల్లో , వెన్నెల రాత్రుల్లో లింగబేధం లేకుండా, వయస్సుల తారతమ్యం పాటించకుండా ఆడేవారు. ఆటలు వారి జీవన ప్రయాణంలో భాగస్వామ్యమై ఉండేవి. అంతటి ప్రాధాన్యం ఉన్న అప్పటి ఆటల్లో కొన్ని....

- (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)





- శారీరక ఆరోగ్యం, వినోదమే ప్రధానంగా అప్పటి ఆటలు
- పెరిగిన సాంకేతికతతో మరుగునపడ్డ ఆటలు
- డిజిటల్ గేమ్స్‌తో కనుమరుగు

రోజురోజుకూ సాంకేతికపరమైన వస్తువులపై మక్కువ చూపిస్తుండటంతో ఆటలపై పిల్లలో అనాసక్తి మొదలైంది. దీంతో గత కాలపు ఆటలు కనుమరుగయ్యే దశకు చేరుకున్నాయి. ప్రధానంగా అండ్రాయిడ్, గేమింగ్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు పిల్లల చేతుల్లోకి రావడంతో శారీరక శ్రమకోర్చే ఆటలపై ఆసక్తి చూపించడం లేదు. దీంతో శరీరానికి శ్రమ కరువై వారు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధానంగా చిన్నవయస్సులోనే కంటి సమస్య, పొట్ట రావడం, మానసికఒత్తిడితో అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. పిల్లలు అందరూకలిసి జట్టుగా ఆటలు ఆడకపోవడంతో పిల్లల మధ్య స్నేహ సంబంధాలు తగ్గిపోతున్నాయి. ఇప్పటికైనా తల్లిదండ్రులు స్పందించి గత ఆటల సంస్కృతీ, సంప్రదాయాలపై వారికి ఆసక్తిని కలిగించేలా, పిల్లలు స్మార్ట్‌ఫోన్లకు పరిమితం కాకుండా అందరితో కలిసి ఆడుకునేలా ప్రత్యేక దృష్టి సారించి ఆనాటి ఆటలు కనుమరుగు కాకుండా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉంది. గతంలో పాఠశాలలకు విద్యార్థులు వెళ్లాలంటే ఇంటి నుంచి కిలోమీటర్ నుంచి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరం కాలినడకన వెళ్లేవారు. దీంతో నడక చిన్నతనంలో అలవాటైపోవడంతో ఇప్పుడు వారు ఎంతో ఆరోగ్యం ఉన్నారు. అంతేకాకుండా పాఠశాల మైదానంలో విద్యార్థులు అందరూ కలిసి రకరకాలు ఆటలు ఆటడంతో వారిలో స్నేహబంధాలు, పట్టుదల, ఐక్యమత్యం, మానసిక ప్రశాంత ఏర్పడి ఎలాంటి రోగాల బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉన్నారంటే అన్నింటికి కారణం ఆటలు. ప్రభుత్వాలు సైతం విద్యార్థులకు చదువుతో పాటుగా ఆటలపై అవగహన కల్పించి ప్రత్యేక దృష్టి సారించి ప్రతి పాఠశాలలో ప్రత్యేకంగా పీఈటీలను నియమించి చక్కదిద్దాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

గతకాలపు ఆటలు

టైరాట	వంగుడు దుంకుడు	కుంటరా గాడిద కుంటూ
వీరివీరి గుమ్మడిపండు	రేసాట	చిర్రగోనే
కోతికొమ్మచ్చి	బొమ్మరిల్లు	కబడ్డీ
అల్లం-దుర్గం	ముక్కు గిచ్చుడు	సీసం గోళీకాయల
బొంగారాల	దస్తే బిస్తడి	వనగుంటలు
కైలాసం	చెల్లెల బండి	పుంజీతం
అష్టాచమ్మ	గచ్చకాయల	చెస్
దోపుడుపుల్ల	ఉప్పు బెరలాట	క్యారంబోర్డు
నాలుగు రాళ్ల		

ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించాలి



ప్రభుత్వాలు క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థుల్లో దాగియున్న నైపుణ్యాన్ని వెలికితీయాలి. క్రీడాకారులు మండల స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఆధారపడి ఉంది.

- పూల నాగయ్య, రిటైర్డ్ పీఈటీ

గచ్చకాయలు, ముక్కు గిచ్చుడు ఇష్టం



చిన్నప్పుడు గ్రామంలో సాయంకాలం స్నేహితులు అందరం కలిసి గచ్చకాయల ఆట, అష్టాచెమ్మ, దోపుడు పుల్ల, ఉప్పు బెరడు, చిక్కుడు బిల్ల, బొమ్మరిల్లు, సెల్లెల బండి ఆట ఆడుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చేది. తోటి స్నేహితులు ఎవరైనా గొడవపడితే ముక్కు గిచ్చుడు ఆట ఆడితే వారిని కోపంతో గట్టిగా గిచ్చేవాళ్లం. వేసవిలో ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా అమ్మానాన్న కైలాసం ఆట ఆడించేవారు. ఎక్కువగా పాపాలు ఎవరు చేస్తే వారిని అనకొండ పాము మింగుతుందని అనడంతో ఎంతో భయపడేవాళ్లం. కైలాసం ఆట అంటే ఎంతో ఇష్టం.

- చంద్రగాని అయిలమ్మ, వంగపల్లి

చిర్రగోనె, కబడ్డీ ఆటలపై మక్కువ ఎక్కువ



గతంలో పాఠశాల వదలగానే ఇంటికి వెళ్లి నలుగురు కలిసి చిర్రగోనె, కబడ్డీ ఆటలు ఆడితే ఎంతో సంతోషంగా ఉండేది. స్నేహితులంతా కబడ్డీలో తాము గెలువాలం టే, తాము గెలుస్తామంటూ పోటాపోటీగా ఆడి సంతోషపడేవాళ్లం. నాటి ఆటలు నేటి పిల్లలకు అందకుండా పోతున్నాయి.

- బోగ సంజీవ, యాదగిరిగుట్ట

ఆనాటి ఆటలు నేటి తరానికి అందించాలి



ఆనాటి ఆటలను తల్లిదండ్రులు పిల్లలతో ఆడిస్తూ ఆటల గురించి వాటిని వివరించాలి. ఆటల సంస్కృతీ, సంప్రదాయాలు పిల్లలకు తెలియపర్చాలి. అలనాటి ఆటలు అంతరించకుండా భావితరాల వారికి అందించేలా ప్రతీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

- పేరబోయిన పెంటయ్య, కొత్తగుండ్లపల్లి

పిల్లలను స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి



చిన్ననాటి నుంచే పిల్లలకు స్మార్ట్‌ఫోన్లు ఇవ్వకుండా వారిని దూరంగా ఉంచాలి. ఫోన్లు ఇవ్వడంతో ఇతర ఆటలపై ఆసక్తి ఉండకుండా పోవడమే కాకుండా వారిలో అనారోగ్య సమస్యలు, కంటి సమస్యలు ఎక్కువగా తలత్తే ప్రమాదం ఉంది. వాటిని నివారించి అలనాటి ఆటలను ఆడించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, అందరిపై ఉంది.

- పేరబోయిన రేణుక, కొత్తగుండ్లపల్లి

ఆర్థిక ఇబ్బందులతో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య



శ్రీనివాస్‌రావు(ఫైల్)

నాగార్జునసాగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో సోమవారం జరిగింది. ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం సాగర్ హిల్‌కాలనీకి చెందిన నెల్లం శ్రీనివాస్‌రావు(42) డిండిలో నీటిపారుదల శాఖ విభాగంలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యం, ఆర్థికసమస్యలతో ఇబ్బందులుపడుతున్నాడు. సోమవారం ఉదయం 11గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. బయటకు వెళ్లివచ్చిన భార్య విజయశ్రీ గమనించే సమయానికే మృతి చెందాడు. విజయశ్రీ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. శ్రీనివాసరావుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అనారోగ్య సమస్యలతో యువతి



మౌనిక (ఫైల్)

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలతో యువతి ఆత్మహత్యకు పాల్పడింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ పట్టణ కేంద్రం రాంనగర్‌కు చెందిన గుండ్ల మౌనిక(25) అవివాహితురాలు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. మనస్తాపానికి గురైన మౌనిక ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకుంది. తండ్రి రామచంద్రయ్య బయటికి వెళ్లి వచ్చేసరికి మౌనిక మృతి చెందింది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి రామచంద్రయ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో ప్రైవేట్ ఉద్యోగి..



జనార్దన్(ఫైల్)

పెన్‌పహాడ్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ గోపీకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సింగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గుణగంటి జనార్ధన్(37) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. భార్య చంద్రకళతో పాటు ఇద్దరు కుమార్తెల ఉన్నారు. అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చి వెళ్తుంటాడు. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి సమీపంలోని గుడుగుంట్లపాలెం వద్ద ఉన్న గురుకుల హాస్టల్‌లోని కుమార్తెను తీసుకురావడానికి చంద్రకళ వెళ్లింది. సాయంత్రం కుమార్తెతో కలిసి తిరిగి వచ్చే సరికి ఇంట్లో గుణగంటి జనార్ధన్(37) ఉరివేసుకుని కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శవపంచనామా అనంతరం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. తనకు తెలియకుండా అప్పులు చేసి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీకృష్ణ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి బావిలో పడి మృతి

కట్టంగూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మానసిక స్థితి బాగోలేక ప్రమాదవశాత్తు బావిలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. నల్లగొండ జిల్లా కట్టంగూరు ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పరడ గ్రామానికి చెందిన కాసర్ల శ్రీనివాస్ రెడ్డి(47) కొంతకాలంగా మానసిక స్థితి బాగోలేక ఇబ్బందిపడుతున్నాడు. ఈ నెల 2న సాయంత్రం ఇంటి నుంచి బయటకువెళ్లాడు. రాత్రి వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. మండలంలోని ఈదులూరు గ్రామ శివారులోని మారబోయిన కలమ్మ వ్యవసాయ బావిలో గుర్తుతెలియని మృతదేహం నీళ్లపై తేలింది. స్థానికుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న శ్రీనివాసరెడ్డి బంధువులు వెళ్లి మృతదేహాన్ని చూసి గుర్తించారు. శ్రీనివాసరెడ్డి భార్య విడాకులు తీసుకుని వెళ్లిందని తల్లి కాసర్ల యాదమ్మ పోలీసులకు తెలిపింది. యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. తన కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నాట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఒక కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

10 తులాల బంగారం అపహరణ

మునుగోడు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కచలాపురంలో భారీ చోరీ జరిగింది. సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం కచలాపురం గ్రామానికి చెందిన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో సోమవారం ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 10తులాల బంగారం అపహరించారు. పనులు ముగించుకొని ఇంటికి వెళ్లే సరికి చోరి జరిగిందని గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ రవి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ తెలిపారు. బంగారం విలువ రూ.9 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

గడ్డివాము దగ్ధం



వేములపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఆమనగల్లు గ్రామానికి చెందిన బయ్య సైదులు పశువుల మేత కోసం ఎనిమిది ఎకరాల గడ్డిని గ్రామసమీపంలోని బండపైన గడ్డివాము వేశాడు. సోమవారం మధ్యాహ్నం ప్రమాదశాత్తు నిప్పంటుకోని దగ్ధమవుతుండగా గమనించిన స్థానికులు నీటిట్యాంకర్ సహాయంలో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ పూర్తిగా దగ్ధమైందన్నారు. సుమారు రూ.50వేల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు బయ్య సైదులు ఆవేదన వ్యక్తం చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

భువనగిరి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి ఖిల్లా వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఆలేరుకు చెందిన కే శ్రీధర్‌చారి(21), భువనగిరికి చెందిన రంగాపురం నవదీప్ బైకులపై ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇరువురిని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా శ్రీధర్‌చారి చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు శ్రీధర్‌చారి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

● కేతేపల్లి : సూర్యాపేట జిల్లా కేతేపల్లి మండలంలో హైదరాబాద్-విజయవాడ రహదారిపై రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన కందికంటి అశోక్ తన బైక్‌పై నకిరేకల్ వెళుతున్నాడు. బైక్ ఇనుపాముల శివారులోకి రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కకు వేగంగా దూసుకెళ్లి చెట్టుకు ఢీకొట్టింది. ఈ సంఘటనలో అశోక్ కాలు తెగి పూర్తిగా శరీరం నుంచి విడిపోయి దూరంగా పడిపోయింది. సంఘటనా సమాచారం అందుకున్న 108సర్వీసు సిబ్బంది క్షతగాత్రుడిని సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

● వేంపాడులో ఎమ్మెల్సీ కోటిరెడ్డి డ్రైవర్...



నర్సింహ(ఫైల్)

నిడమనూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి వద్ద వ్యక్తిగత డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వేంపాడ్ సమీపంలో సోమవారం జరిగింది. ఎస్ఐ ఉప్పు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన ఉప్పునూతల నర్సింహ(41) ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి వద్ద వ్యక్తిగత డ్రైవరుగా పనిచేస్తూ మిర్యాలగూడలోని బాపూజీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం విధులు ముగించుకున్న నర్సింహ స్వగ్రామమైన ఎర్రబెల్లికి వెళ్లి పొలం పనులు చూసుకుని తిరిగి బైక్‌పై సాయంత్రం నాలుగు గంటల సమయంలో మిర్యాలగూడకు బయలుదేరాడు. నిడమనూరు మండలం వేంపాడ్ సమీపంలో అన్నారం స్టేజీ దగ్గర ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని ఓ వాహనం ఢీకొనడంతో బైక్‌పై ఉన్న నర్సింహ కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నర్సింహ మృతితో ఎర్రబెల్లి, పరిసర గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే నర్సింహ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్న విషయం జీర్ణించుకోలేకపోతున్నారు. నర్సింహ మృతదేహం వద్ద కుటుంబసభ్యులు బోరున విలపించారు. నర్సింహకు భార్య రామేశ్వరి, ఇద్దరు కుమారులు ఈశ్వర్, అజయ్ ఉన్నారు. ఆస్పత్రిలో ఉన్న నర్సింహ మృతదేహాన్ని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. నర్సింహ భార్య రామేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

● నూతనకల్ : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిన్ననేమిల క్రాస్ రోడ్డు వద్ద సూర్యాపేట-జనగాం 365 జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం మద్దిరాల మండలం మామిండ్లమడవ గ్రామానికి చెందిన షేక్ మల్సూర్ తన బైక్‌తో చిన్ననెమిల క్రాస్ రోడ్డుకు వచ్చాడు. జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ నుంచి మరిపెడబంగ్లా వైపు వెళ్తున్న కారు అతివేగంగా ఢీకొట్టింది. దీంతో గాలిలోకి ఎగిరి మల్సూర్ కిందపడడంతో అతడి తలకు బలమైన గాయాలయ్యాయి. కాలు వేళ్ల తెగిపడ్డాయి.

అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేటకు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ మహేంద్రనాథ్ సందర్శించి, వివరాలు తెలుసుకున్నారు.

నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం



రైతు ఫిర్యాదుపై విచారణ చేస్తున్న ఏడీ రవి

నేరేడుచర్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రైతు ఫిర్యాదుపై ఫర్టిలైజర్ దుకాణ యజమానిని విచారించామని, రైతుతో మాట్లాడామని విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏడీఏ రవి అన్నారు. పురుగుల మందు పిచికారీ చేయడం వల్ల తాను నష్టపోయానని ఫర్టిలైజర్ దుకాణ నిర్వాహకులపై రైతు ఫిర్యాదు మేరకు సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో సోమవారం వ్యవసాయాధికారులు విచారణ ప్రారంభించారు. నేరేడుచర్ల వ్యవసాయాధికారి కార్యాలయానికి ముకుందాపురం గ్రామ రైతు శ్రవణ్‌తో పాటు, లక్ష్మీవేంకటేశ్వర ఫర్టిలైజర్ డీలర్ ముదిరెడ్డి వెంకటరెడ్డిని పిలిపించి విచారణ చేపట్టారు. ఇరువురి వాదనలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఏడీఏ తెలిపారు. డీలర్ వెంకటరెడ్డి ఏ కంపెనీ సరఫరా చేసిన మందులు రైతుకు ఇచ్చింది వివరాలు సేకరించారు. కంపెనీపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. రైతుకు తగిన న్యాయం చేస్తామని ఏడీఏ రవి తెలిపారు. ఆయన వెంట వ్యవసాయాధికారి జావిద్ ఉన్నారు.

ఏపీ నుంచి హైదరాబాద్‌కు ఇసుక

● మిర్యాలగూడ వద్ద పట్టుకున్న పోలీసులు



మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కిష్టాపురం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఓవర్‌లోడ్‌తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీని ఆపి లోడుకు సంబంధించిన పత్రాలను పరిశీలించగా ఎలాంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా చిన్నగంజం నుంచి హైదరాబాద్‌కు ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో టీఎస్ 05యూడీ1225 నెంబరుగల లారీ డ్రైవర్ బత్తుల రాజును అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. తనిఖీలో పట్టుబడ్డ లారీ నల్లగొండ పట్టణానికి చెందిన రాచకొండ నగేష్‌గౌడ్‌కు చెందినదిగా గుర్తించినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక అక్రమరవాణాకు పాల్పడుతున్న లారీని సీజ్ చేసి డ్రైవర్ రాజుతోపాటు, సదరు వాహనం యజమాని నగేష్‌గౌడ్‌పై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

పోలీసుల అదుపులో సిగరెట్ దొంగలముఠా?

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ బాలాజీ కిరాణ దుకాణంలో రూ.15లక్షల విలువైన సిగరెట్ల బాక్సులను ఎత్తుకెళ్లిన దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు దొంగల ముఠా సభ్యులను స్థానిక పోలీసులు స్వరాష్ట్రంలోని స్వగ్రామంలో పట్టుకున్నట్లు తెలుస్తోంది. దొంగలను అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సిగరెట్టు బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు మంగళవారం వెల్లడించే అవకాశం ఉంది.

దేవాలయంలో చోరీ

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కుంట్లగూడెంలో పెద్దమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి మెడలోని తులంపావు బంగారు చైన్, పావుతులం ముక్కుపుడక, కిలో వెండి కిరీటం, అరకిలో వెండి ప్లేటు చోరీ చేశారు. ఈ మేరకు దేవాలయ అధ్యక్షులు నరేశ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్లాట్ల కబ్జాపై ఫిర్యాదు

భువనగిరి (కలెక్టరేట్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తమపేరున రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని కబ్జా చేస్తున్నారని, న్యాయం చేయాలని ప్లాట్ల కొనుగోలుదారులు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ప్రైవేట్ బస్సులో యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదుచేసి అదనపు కలెక్టర్‌కు ఆవేదనను వెళ్లబోసుకున్నారు. బాధితులు మాట్లాడుతూ 2011-12లో యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామ రెవెన్యూ పరిధిలోని మహాదేవ్ ఎస్టేట్ వెంచరు సర్వేనంబరు 129, 130, 131లలో సత్యనారాయణరెడ్డి అనే వ్యక్తి 600 ప్లాట్లు చేశారని, వాటిలో పలుప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. పూర్తిగా డబ్బులు చెల్లించడంతో రిజిస్ట్రేషన్ అయ్యిందన్నారు. పేరు మార్చుకోకపోవడంతో తిరిగి అతడి పేరునే రికార్డు వస్తుండటంతో ప్లాట్ల హద్దులను నిర్ణయించుకున్నామని, కానీ ఇటీవల కొందరు తమ హద్దులను తొలగించి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బాధితులు కుమారస్వామి, మోహిన్‌ఖాన్, శ్రీరంగం, భాగ్య, మీనాక్షి, పద్మజ, జ్యోతి, దేవేందర్, శోభారాణి శ్రీలత, పలువురు వృద్ధులు, మహిళలు ఉన్నారు.

శరవేగంగా విజయవిహార్ ఆధునికీకరణ

- రూ.5కోట్లతో పూర్తికి కసరత్తు
- సాగర్‌కు రానున్న 140 దేశాల మిస్‌వరల్డ్ పోటీ యువతులు, దేశ, విదేశీ మీడియా ప్రతినిధులు



విజయవిహార్ భవనానికి రంగులు వేస్తున్న కూలీలు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని విజయవిహార్ అతిథి గృహంలో రూ.5 కోట్లతో చేపట్టిన ఆధునికీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మే 7వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే మిస్‌వరల్డ్ పోటీలకు 140 దేశాలకు చెందిన యువతులు, 3 వేల మంది దేశ, విదేశీ మీడియా ప్రతినిధులు హాజరవుతున్నారు. వీరంతా రాష్ట్రంలో వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్నారు. దీనిలో భాగంగా మే 12న నాగార్జునసాగర్‌కు వస్తున్నారు. సాగర్‌లో బుద్ధవనం, జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండను సందర్శిస్తారు. వీరు ఇక్కడ విడిది చేయడానికి వీఐపీ అతిథి గృహం అయిన విజయవిహార్‌ను ఎంపికచేశారు. మిస్‌వరల్డ్ పోటీలకు కేవలం నెల రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఆధునికీకరణ పనులు శరవేగంగా చేస్తున్నారు. పనులను గత నెల 22న పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిలు పరిశీలించారు. విజయవిహార్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి ప్రతిష్ఠను, తెలంగాణ సంస్కృతీ,సంప్రదాయాలను దేశ, విదేశాలకు తెలియపరిచేలా పర్యాటక ప్రాంతాలను తీర్చి దిద్దాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో విజయవిహార్‌లో ప్రస్తుతం స్విమ్మింగ్ పూల్, సరోవర్ విభాగంలో రంగులు అద్దె పనులు చకచక సాగుతున్నాయి. ప్రధాన విభాగంలో రిసెప్షన్‌పైన ఉన్న గదులకు చిప్పింగ్ చేయడం వంటి పనులు చేస్తున్నారు. అంతే కాకుండా డ్రైనేజీ నూతన లైన్లను ఏర్పాటు చేస్తున్నారు.



నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ కాల్వ

20 రోజుల్లో పనులు పూర్తి చేస్తాం

విజయవిహార్ అతిథి గృహం ఆధునికీకరణ పనులను 20 రోజుల్లో పూర్తి చేస్తాం. మిస్‌వరల్డ్ పోటీదారులు సాగర్ సందర్శనకు వచ్చే నాటికి అన్ని పనులు పూర్తి చేస్తాం. ఇప్పటికే సగం పనులు పూర్తయ్యాయి.

శ్రీనివాస్‌రెడ్డి, డీఈ, పర్యాటక శాఖ

ఎడ్ల పందేలకు పెరుగుతున్న ఆదరణ

తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు ప్రారంభించిన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



ఉమ్మడి రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే జాతరలు, ఉత్సవాల్లో ఎడ్ల పందేలకు ఆదరణ పెరుగుతోందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేల పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏటా శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పందేల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, పల్నాడు, కృష్ణా, తెలంగాణలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన ఎనిమిది ఎద్దుల జతలను సంబంధిత యజమానులు తీసుకొచ్చారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మార్కెట్ డైరెక్టర్ శాగం మంగమ్మ, ఏసీపీ చవ్వా శంకర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శాగం నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శాగం పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, గురునాథం, బద్దెల వెంకన్న, లాలునాయక్, భద్రినాయక్, చింతల చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పొగాకు సాగు లాభాలు బాగు

పదేళ్లుగా సాగుచేస్తున్న రైతులు ● క్వింటా రూ.15వేలకు విక్రయం



తిమ్మాపురం వ్యవసాయ క్షేత్రంలోని షెడ్డులో ఆరబెట్టిన పొగాకు

అర్వపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రైతులు పొగాకు సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం, అడివెంల, కొమ్మాల, కోమటిపల్లి, కుంచమర్తి గ్రామాలకు చెందిన రైతులు 350 ఎకరాల్లో ఐటీసీ కంపెనీ సహకారంతో పొగాకు తోటలు సాగు చేస్తున్నారు. నీరు తక్కువగా ఉండడంతో రైతులు పొగాకు తోట వైపు మొగ్గు చూపుతున్నారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన వేములకొండ వెంకన్న అనే రైతు పదేళ్లుగా, అదే గ్రామానికి చెందిన బొల్లం వెంకటేశ్వర్లు ఐదేళ్ల నుంచి ఐదు ఎకరాల్లో పొగాకు తోటలను సాగు చేస్తున్నారు. ఎకరానికి రూ.20వేలు పెట్టుబడులు పెడతారు. ఎక్కువ మొత్తంలో రసాయన మందులు వాడటం లేదు. పెట్టుబడి తక్కువగా ఉండి దిగుబడి ఎక్కువగా రావడంలో రైతులు తోటల వైపు మొగ్గు చూపారు. ఈ పంట 90రోజుల్లో చేతికి వస్తుంది. 15 రోజులకోసారి పొగాకు తోటకు నీరు పెట్టి సాగు చేస్తున్నారు. వ్యవసాయ క్షేత్రం వద్ద షెడ్డును ఏర్పాటు చేసి పొగాకు కోత కోసి పది రోజుల పాటు ఆరబెట్టి విక్రయిస్తారు. ఎకరానికి 12క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఐటీసీ కంపెనీ ప్రతినిధులు రైతులకు పొగాకు తోటపై సూచనలు, సలహాలు ఇచ్చి వ్యవసాయ క్షేత్రాల వద్దకు వచ్చి క్వింటాకు రూ.15,500 కొనుగోలు చేస్తున్నారు.

పొగాకు సాగుతో లాభాలు ఆర్జిస్తున్నాం



ఐదేళ్లుగా ఐదు ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నాం. క్వింటాకు రూ.15,500 వస్తున్నాయి. కంపెనీ సూచనల మేరకు పొగాకు తోటలను సాగు చేస్తున్నాం. పెట్టుబడులు పోనూ లాభాలు ఆర్జిస్తున్నాం.

బొల్లం వెంకటేశ్వర్లు రైతు, తిమ్మాపురం గ్రామం,
జాజిరెడ్డిగూడెం మండలం

కొత్త ఎమ్మెల్సీల ఉత్సాహం



ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసి బయటకు వస్తున్న నెల్లికంటి సత్యం

నల్లగొండ జిల్లా సీపీఐ కార్యదర్శి నెల్లికంటి సత్యం సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన అద్దంకి దయాకర్ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. వారికి కాంగ్రెస్, సీపీఐ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



వ్యాధి తగ్గినా.. అప్పులు మిగిలాయి

● గత సంవత్సరం మార్చిలో వింత జ్వరాలతో ఇందుగుల అతలాకుతలం ● మూడు నెలల పాటు వైద్య శిబిరం ● గ్రామస్థుల బాధలు వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'



ఇందుగుల గ్రామం

మాడ్గులపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం మార్చి నెలలో నెలకొన్న ప్రతికూల వాతావరణంతో అంతుచిక్కని రోగంతో ఆ ఊరంతా భయాందోళనకు గురైంది. సుమారు మూడు నెలల పాటు గ్రామస్థులు విష జ్వరాలు, ఒళ్లు నొప్పులతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో వారి బాధ వర్ణనాతీతంగా ఉండేవి. గ్రామంలోని ప్రతి కుటుంబంలోనూ ఇద్దరికి చొప్పున జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడ్డారు. గ్రామంలో సుమారు రెండు వేలకు పైగా జనాభా ఉండగా గ్రామంలో జ్వరాలతో బాధపడుతుంటే వైద్యాధికారులు మాత్రం నామమాత్రంగా పరీక్షలు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. గ్రామస్థుల బాధలపై 'వ్యాధి దొరకక.. చికిత్సకు లొంగక' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. రాష్ట్ర, జిల్లా వైద్యాధికారులను అప్రమత్తం చేశారు. దీంతో అధికారులు గ్రామంలో కొన్ని రోజులపాటు వైద్య శిబిరాలు నిర్వహించి మందులను అందజేశారు. హైదరాబాద్ నుంచి జోనల్ అధికారులు, వరంగల్ నుంచి రాష్ట్ర మలేరియా నియంత్రణ అధికారులు వచ్చి సుమారు 400 మంది నుంచి రక్త నమూనాలను సేకరించారు. గ్రామంలోని నీటి నమూనాలను తీసుకొని ల్యాబ్‌కు పంపించగా రక్త నమూనాలో ఎలాంటి వ్యాధి లక్షణాలు లేవని నిర్ధారించారు.

ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి..

గ్రామంలో ఎక్కువ మంది బాధితులు మిర్యాలగూడ, నల్లగొండ పట్టణాలకు వెళ్లి ప్రైవేట్ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకోవడంతో నెగిటివ్‌గా రిపోర్ట్ వచ్చినా వ్యాధి మాత్రం తగ్గలేదు. దీంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అంతుచిక్కని వ్యాధి వ్యాపించడంతో గ్రామస్థులు అయోమయానికి గురయ్యారు. కీళ్ల నొప్పులతోపాటు శరీరం నల్లగా మారడం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపించడంతో మందులు వాడినంత వరకు వ్యాధి తగ్గినా ఆ తర్వాత తిరిగి వ్యాపించిందని అప్పటి గురించి గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. దీంతో తమ వద్ద ఉన్న డబ్బులు ఖర్చు కాగా అప్పులు తెచ్చి మరీ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఒక్కో రోగికి సుమారు రూ.20వేల నుంచి రూ. 25వేల వరకు ఖర్చయింది. వ్యాధి తగ్గినా అప్పులు మాత్రం ఇప్పటికీ తీర్చలేకపోయామని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

గ్రామంలో విస్తృతంగా జ్వరాలు వ్యాపించడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కువగా దోమలు ఉండడంతో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు అన్నారు. గతేడాది తమకు వ్యాపించిన అంతుచిక్కిన వ్యాధితో ఇప్పటికీ గ్రామంలో ఎవరిని కదలించినా 'వామ్మో ఆ నొప్పులా' అని తలుచుకొని ఇప్పటికీ భయపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామంలో ఎలాంటి అలజడి లేదని, ప్రస్తుతం గ్రామస్థులు ఆరోగ్యంగా ఉన్నారని, ఇబ్బందులు ఉంటే వెంటనే తమను సంప్రదించాలని వైద్యులు పేర్కొంటున్నారు.

కొద్దిగా నొప్పులు ఉన్నాయి



గత సంవత్సరం నాకు జ్వరం వచ్చింది. మూడు నెలల పాటు బాధను అనుభవించా. దీంతో నేను ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నా. జ్వరం తగ్గిన తర్వాత కూడా కీళ్ల నొప్పులు, వాపులు మొదలయ్యాయి. ముఖంపై నల్లటి మచ్చలు వచ్చా యి. మళ్లీ వైద్యం చేయించుకోవడంతో రూ.25వేలు ఖర్చు అయ్యాయి. తిరిగి ఇప్పుడు మళ్లీ నొప్పులు కొద్దిగా మోకాళ్ల నొప్పి వస్తుంది. మందులు వాడుతున్నా.

దాసరి సైదులు, ఇందుగుల

ప్రస్తుతం ఎలాంటి జ్వరాలు లేవు



ఇందుగులలో గత ఏడాది మార్చిలో వైద్య శిబిరం నిర్వహించాం. రాష్ట్ర, జిల్లా వైద్యాధికారుల సూచనల మేరకు గ్రామంలో పర్యటించి ఇంటింటికీ తిరిగి జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడిన వారికి మందులు పంపిణీ చేశాం. ప్రస్తుతం గ్రామంలో ఎలాంటి జ్వరం, ఒళ్లు నొప్పుల వంటి వారు ఎవరూ లేరు. ఏదైనా సమస్య ఉంటే తమను వెంటనే సంప్రదించాలి.

● ఫిర్దోస్, మెడికల్ ఆఫీసర్, ఇందుగుల

నేత్రపర్వంగా రాములోరి పట్టాభిషేకం

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో రాములోరి పట్టాభిషేకం సోమవారం వైభవంగా నిర్వహించారు. నిత్యారాధనల అనంతరం తిరువీధిసేవ చేపట్టి మూలమంత్ర జపాలు, దశశాంతి, పంచసూక్త పారాయణాలతో అభిషేకాలు, ఆధ్యాత్మ రామాయణ పారాయణం అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. పట్టాభిషేకం మహోత్సవ విశిష్టతను ఆలయ సిద్ధాంతి గౌరిభట్ల సత్యనారాయణశర్మ, ప్రధాన పూజారి నరసింహమూర్తి భక్తులకు వివరించారు. అర్చకుల వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య అభిషేక మండపంలోని సువర్ణ కలశాలలో నింపి స్వర్ణ సింహాసనంపై అధిష్ఠింపజేసి పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని యాగశాలలో సహస్రనామార్చనలు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వితరణ జరిపారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఈవో ఏపూరి భాస్కర్‌రావు, ఉప కార్యనిర్వాహణ అధికారి దోర్బల భాస్కరశర్మ, ఏఈ వోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రమేష్‌బాబు, రఘు, పర్యవేక్షకులు నాగుల మహేష్, రామరావునాయక్ తదితరులు పాల్గొన్నారు.

శివకేశవులకు విశేష పూజలు

శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీ వైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.19,44,856ల ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



హారతి సమర్పిస్తున్న అర్చకుడు



మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో భక్తవత్సలుడి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వయంభువునికి పంచామృతాలతో పంచసూక్త విధానంగా అభిషేకాలు చేపట్టారు. ఉదయం యాగశాలలో సుదర్శన నారసింహ హోమాలు జరిగాయి. ఉత్సవ మూర్తులను ఆలయ ప్రదక్షిణ చేయించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	516.30
టీఎంసీలు	142.6157
ఎడమకాల్వకు నీటి విడుదల	4,881
కుడికాల్వకు	2,053
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	8,734

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.88 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	624.40 అడుగులు
టీఎంసీలు	0.76
కాల్వలకు విడుదల	26.19 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	620.94 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	55.09క్యూసెక్కులు

కంపచెట్లు పెరిగి.. రక్షణ గోడలు లేక

● పూర్తిస్థాయిలో మరమ్మతులకు నోచని ఏఎమ్మార్పీ ప్రాజెక్టు ● మొక్కుబడిగా కంపచెట్లు తొలగింపు ● మరమ్మతులు పూర్తయ్యేదెన్నడో?

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జంటనగరాలకు, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సాగు, తాగునీరు అందించే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు మరమ్మతులు పూర్తిస్థాయిలో జరగడంలేదు. గతంలో రక్షణ గోడ కుంగడంతో మోటర్లను ఆపివేసి ఇసుక బస్తాలు వేసి నీరులీకేజీ కాకుండా చేశారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని అధికారులు ఆదేశించినా ముందుకు సాగడం లేదు. నాగార్జునసాగర్ నీటిమట్టం ప్రస్తుతం 516అడుగులు ఉంది. 510అడుగులకు దిగువకు చేరితే అవసరమైన నీటిని మోటర్ల ద్వారా ఎత్తిపోసి హైదరాబాద్ జంట నగరాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు తాగునీరు అందించడానికి హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు చర్యలు చేపట్టనుంది. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పుట్టంగండి జీరో పాయింట్ వద్ద 2024లో రూ.3కోట్లతో పనులు చేపట్టి 600 హెచ్‌పీ సామర్థ్యం గల ఐదు మోటర్లు, 300 హెచ్‌పీ సామర్థ్యం గల మరో ఐదు మోటర్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా సాగర్ బ్యాక్ వాటర్ నుంచి రోజుకు 900క్యూసెక్కుల నీటిని పుట్టంగండి అప్రోచ్ కెనాల్‌లోకి ఎత్తిపోశారు. ప్రస్తుతం సాగర్ నీటిమట్టం 516అడుగులు ఉందని ఇప్పటివరకు ఇబ్బంది లేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. 2016, 2017, 2018, 2019, 2024లో వరుసగా మోటర్ల ఏర్పాటు చేసి సాగర్ నీటి మట్టం 500అడుగుల వరకు ఉన్నా నీటిని ఎత్తిపోశారు. కొన్ని సందర్భాల్లో మోటర్లకు నీరు అందకపోవడంతో నదిలో కాల్వ తవ్వి నీటిని పుట్టంగండి మోటర్లకు అందించారు. ప్రస్తుతం నాలుగు మోటర్ల ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని అక్కంపల్లి రిజర్వాయర్ తరలిస్తున్నారు. అక్కడి నుంచి జంటనగరాలకు 525 కూసెక్కులు, మిషన్‌భగీరథ 45 క్యూసెక్కుల నీటిని, పానగల్ రిజర్వాయర్‌కు 1100క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

రూ.9 కోట్లతో ప్రతిపాదనలు

పుట్టంగండి పంప్‌హౌస్, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చుట్టూ కంపచెట్లు ఏపుగా పెరిగి నీరు లీక్ అవడంతో గత సంవత్సరం రూ.9కోట్లతో కంపచెట్లను తొలగించారు. ఇంకా పూర్తిస్థాయిలో పనులు పూర్తికాలేదు. గత సంవత్సరం మొదటి యూనిట్ మరమ్మతులకు గురికావడంలో రూ.1.5కోట్లతో మరమ్మతులు చేపట్టారు. గత సంవత్సరం నిర్వహణ కోసం జెన్‌కో అధికారులు రూ.8.84 కోట్లతో ప్రతిపాదనలు చేయగా అది మార్చితో ముగిసింది. 2025-2026 సంవత్సరానికి నిర్వహణ కోసం రూ. రూ.9 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు.



చేయాల్సిన పనులు

గతంలో పుట్టంగండి నుంచి అక్కంపల్లి రిజర్వాయర్ వరకు 12 కిలోమీటర్ల దూరం కెనాల్‌కు లైనింగ్ మురమ్మతుల కోసం రూ.51 కోట్లు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రాలేదు. దీంతో పనులు ఇంకా ప్రారంభించలేదు. అలాగే ప్రధాన కాల్వలకు ఉన్న లింక్ కెనాల్‌లు కంపచెట్లతో నిండి ఉన్నాయి. దీంతో ఆయకట్టు చివరి వరకు నీరు చేరక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వల్లో పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉంది. అలాగే కాల్వల లైనింగ్ మరమ్మతులు చేయాల్సి ఉంది. అదే విధంగా పూర్తిస్థాయిలో రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంది.

పెంపకందారులకు పరిహారం ఇవ్వాలి

భువనగిరి రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెల, మేకల పెంపకం దారుల యజమానులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) యాదాద్రిభువనగిరి జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీఎంపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూగ జీవాలకు గ్రామాల్లో నీటి తొట్లు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ భూముల్లో తుమ్మ చెట్లను ఉచితంగా మేపుకోవడానికి అవకాశం ఇవ్వాలని పెంపకం దారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాక జహంగీర్, మద్దెపురం బాలనర్సింహ, రాజలింగం, బాలేశ్వర్, అశోక్, యాదగిరి, కృష్ణ పాల్గొన్నారు.

వేసవిలోనూ కోనేరుకు జలకళ



దేవరకొండ ఖిల్లాపై ఉన్న కోనేరులో నిండుగా ఉన్న నీరు

దేవరకొండ ఖిల్లాతోపాటు కోనేరుకు సుదీర్ఘ చరిత్ర ఉంది. వేసవి, కరువు పరిస్థితుల్లోనూ కోనేరు ఎండిన సందర్భాలు లేవు. 13వ శతాబ్దంలో రేచర్ల పద్మనాయక వెలమరాజులు దేవరకొండ దుర్గాన్ని రాజధానిగా చేసుకొని 1326 నుంచి 1475 వరకు 149 సంవత్సరాలు పాలించారు. 770 సంవత్సరాలకు పూర్వం ఏడు కొండలు కలుపుతూ దేవరకొండ దుర్గాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఎంతటి కరువు వచ్చినా కోనేరు ఎండిన సందర్భాలు లేవు. కొబ్బరినీటిని తలపించే విధంగా కోనేరు నీరు ఉండడంతో ఖిల్లాను సందర్శించడానికి వస్తున్న విదేశీయులు, పర్యాటకులు, భక్తులు, గొర్రెల కాపర్లు ఖిల్లాలోని కోనేరు నీటిని తాగుతారు. కోనేరుకు ఎక్కడి నుంచి నీరు వస్తుందో ఇప్పటికీ అంతుచిక్కని రహస్యం.

● దేవరకొండ, ఆంధ్రజ్యోతి

బతుకు పోరాటం







మనుషులకైనా, జీవులకైనా బతుకు పోరాటం తప్పదు. తమను తాము కాపాడుకునే సమయంలో ఎంతటి బలవంతుడినైనా ఎదిరించే ధైర్యం వస్తుంది. శక్తినంతా కూడగట్టి పోరాడేందుకు సిద్ధమవుతారు. ఇలాంటి దృశ్యమే నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని కతాల్‌గూడెం గ్రామంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. గాయపడిన ఓ ఎలుకను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన రెండు కాకులతో ఓ ఎలుక శివంగిలా పోరాడింది. ప్రత్యర్థి తనకన్నా శక్తివంతులని తెలిసినా తన సహచర ఎలుకను హత్తుకొని కాకుల బారిన పడకుండా ధైర్యంగా ఎదుర్కొంది. కాకులను దగ్గరకు రానివ్వకుండా పోరాడింది.

\- ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటో గ్రాఫర్
నల్లగొండ.







ఆంధ్రజ్యోతి **
సూర్యాపేట
కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి
8 www.andhrajyothy.com ● మంగళవారం 8 ఏప్రిల్ 2025

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు సుంకరి శ్రీనివాస్, బుడిగె మల్లయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌లోని అంజయ్యభవన్‌లో జరిగే ఆర్టీసీ జేఏసీ సమావేశానికి వెళుతున్న సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో మాచర్ల లచ్చయ్య, ఎస్. గౌడ్, ఏకాంబరం, సాగర్, మధు. సైదులు, గోవిందరాజు, సైదులు పాల్గొన్నారు.

మహిళలకు చీరెలు పంపిణీ

చిలుకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆచార్యులగూడెం గ్రామంలో ఆదివారం శ్రీకోదండరామస్వామి భక్తజన బృందానికి చెందిన 15మంది మహిళలకు చీరలు, 15మంది పురుషులకు టవల్స్‌ను ఫౌండేషన్ చైర్మన్ ములుగూరి నాగరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు చింతరెడ్డి సైదిరెడ్డి, సారెడ్డి వెంకట్‌రెడ్డి, వెంకట్రాం, నర్సయ్య, గోవింద్, అనిత, రాజ్యలక్ష్మి, ధనమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

జిల్లాలో మినరల్ వాటర్ దందా

● పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్ ప్లాంట్లు ● వేసవి నేపథ్యంలో ఇష్టారాజ్యం ● తనిఖీ చేయని అధికారులు

జిల్లాలో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వేసవిని క్యాష్ చేసుకోవాలని పట్టణాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. మునిసిపాలిటీల్లోని ఒక్కో వార్డులో ఆరేడు మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. 20 లీటర్ల క్యాన్‌కు రూ.10 నుంచి 15వరకు వసూలు చేస్తున్నారు. మరి కొందరు కూలింగ్ వాటర్ క్యాన్లను విక్రయిస్తూ రూ.30 నుంచి రూ.40 వసూలు చేస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ల పేరుతో చాలామంది జనరల్ వాటర్‌నే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

(సూర్యాపేట టౌన్ - ఆంధ్రజ్యోతి)

మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాట్లకు నిర్వాహకులు తమ పరిధిలోని మునిసిపాలిటీ, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. అయితే ఏ ఒక్క వాటర్ ప్లాంటుకూ అనుమతులు లేవు. దీంతో పట్టణాల్లో వాటర్ ప్లాంట్ల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఇంట్లో ఒక బోరు ఏర్పాటు చేసుకొని, రూ.80వేల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాట చేసుకుని నెలకు రూ.12 వేలకు పైగా ఇంటి వద్దే ఉండి డబ్బులు సంపాదించుకుంటున్నారు. అయితే కొంతమంది మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినప్పటికీ దానిలో వినియోగించే కెమికల్ మోతాదు తెలియక ఇష్టానుసారంగా వినియో గిస్తున్నందున నీటి నాణ్యత లోపిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మునిసిపాలిటీల్లో అనధికారికంగా 500కు పైగా మినరల్ వాటర్ ప్లాంటు ఉన్నట్లు అంచనా.

కొందరికే లైసెన్సులు

జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో మినరల్ వాటర్ ప్లాంట్లకు కొందరుమాత్రమే లైసెన్సులు తీసుకుని నిర్వహిస్తున్నారు. అనేక మందికి అనుమతులే లేవు. గతంలో మినరల్ ప్లాంట్ల నిర్వాహకులు ఆటోల్లో వాటర్ క్యాన్లు తెచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం వీధికొక వాటర్ ప్లాంటు ఉన్నందున అవసరమైన వారు వాహ నాలపై వెళ్లి వాటర్ క్యాన్లను తెచ్చుకుంటున్నారు. సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో లైసెన్సు ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లు 80 నుంచి 90 వరకు ఉండగా, లైసెన్సులు లేనివి 100వరకు ఉన్నాయి. సాధారణంగా ఒక్క వార్డులో నాలుగు నుంచి ఆరు వరకు వాటర్ ప్లాంట్లు ఉండగా, హుజూర్‌నగర్ మునిసిపాలిటీ మొత్తం 120వరకు ఉన్నాయి. వాటిలో కేవలం 30 నుంచి 40 వరకు మాత్రమే లైసెన్సులు ఉన్నాయి. కోదాడ మునిసిపాలిటీ 180 వాటర్ ప్లాంట్లు ఉండగా, 40వరకు లైసెన్సులు ఉన్నాయి. జిల్లాలో మినరల్ వాటర్ ప్లాంట్లు ఇమ్మడిము బ్బడిగా పెరగడానికి మునిసిపాలిటీ, రెవెన్యూ అధికారుల అలసత్వమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో మొత్తం 800కు పైగా వాటర్ ప్లాంట్లు ఉండగా, వాటిలో అనధికారికంగా 500వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయనందున పరిస్థితి అదుపుతప్పిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



సూర్యాపేట పట్టణ వ్యూ

వాటర్ ఫిల్టర్ల ఏర్పాటుతో కొంత తగ్గిన డిమాండ్

ఇటీవల ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన పెరగడంతో చాలా మంది మునిసిపాలిటీల పరిధిలోని ప్రజలు వాటర్ ఫిల్టర్లను సొంత ఖర్చుతో ఇళ్లలో ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో మినరల్ వాటర్‌ప్లాంట్లకు ఆదరణ కొంత తగ్గింది. ఇంట్లో కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉన్నవారు, శుభకార్యాల సమయంలో మినరల్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు.

అనుమతులు తీసుకోవాలి



వాటర్ ప్లాంట్ నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలి. తనిఖీలు నిర్వహిస్తాం. ప్రజల ఆరోగ్యంలో చెలగాట మాడేవారిపై చర్యలు తీసుకుంటాం.

● బి.శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్

నేటి నుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు



స్వాముల ఉత్సవ విగ్రహాలు

హుజూర్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలం నాటి బూరుగడ్డ శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవా లను ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ యరగాని గురవయ్య తెలిపారు. చైత్రశుద్ధ ఏకాదశి సందర్భంగా 8వ తేదీ సాయంత్రం తొళక్కం ప్రారంభించనున్నారు. 9న అధ్యయనోత్సవాలు, 10న గరుడసేవ, గ్రామంలో స్వామి వార్ల ఊరేగింపు, అనంతరం పరమ పదోత్సవం నిర్వహించను న్నారు. 11న శాత్తుముర్రై ఉపదేశ రచనమాల, ఆల్వార్ ప్రసంగోత్సవం, పుణ్యాహవచనం, ధ్వజపట విన్యాసం నిర్వహించనున్నారు. 12న వేణుగోపాలస్వామికి తిరు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 16వ తేదీ వరకు కొనసాగే ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ యరగాని గురవయ్య కోరారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు



బేతవోలులో సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఈఈ వెంకటకృష్ణయ్య

చిలుకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు హుజూర్‌నగర్ ట్రాన్స్‌కో డీఈఈ వెంకటకృష్ణయ్య తెలిపారు. సోమవారం మండలంలోని బేతవోలు గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. లోవోల్టేజీ సమస్యలు రాకుండా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయడంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. బేతవోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో త్రిఫేజ్ లైన్, సింగిల్ ఫేజ్ లైన్‌ను వేరు చేసినట్లుగా తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో నూతన కరెంట్ పోల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ రామిశెట్టి శ్రీనివాసరావు, సబ్ ఇంజనీర్ పరశురాములు, ఎస్ఎల్ఐ విజయ్‌కుమార్, ఎల్ఐ ధర్మారావు, లైన్‌మెన్లు బాబురావు, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ వట్టికూటి నాగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సన్న బియ్యం పథకం దేశానికి ఆదర్శం



సన్నబియ్యం పథకం లబ్ధిదారులతో కలిసి సహఫంక్తి భోజనం చేస్తున్న కోదాడ మాజీ సర్పంచ్ పారా సీతయ్య

కోదాడ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం దేశానికి ఆదర్శమని డీసీసీ ఉపాధ్యక్షుడు, కోదాడ మాజీ సర్పంచ్ పారా సీతయ్య అన్నారు. సోమవారం కోదాడలోని అంబేద్కర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సన్న బియ్యం లబ్ధిదారుల ఇంట్లో సహఫంక్తి భోజనాలు చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇ యడవెల్లి బాల్‌రెడ్డి, తోట శ్రీను, హనుమంతరావు, కంపాటి శ్రీనివాస్, కాళిదాసు వెంకటరత్నం, పాలూరి సత్యనారాయణ, గుండెల సూర్యనారాయణ, కొప్పూరి వెంకట్రావు, కొమ్ము వెంకటేష్, కంబాల ప్రసాద్, మురళి శేఖర్, పొనుగోటి సైదులు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తాం



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్ జీఎస్టీ ప్రసాద్

కోదాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్ జీఎస్టీ ప్రసాద్ అన్నారు. సోమవారం కోదాడలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నూతన శాఖను ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు నుంచి పెద్ద, మధ్య, చిన్న పరిశ్రమలతోపాటు, రైతులకు రుణాలు అందిస్తామన్నారు. తెలంగాణలోని 33జిల్లాలో 76 బ్రాంచ్‌లు ఉన్నట్లు తెలిపారు. ప్రజల ఆర్థిక అవసరాల అనుగుణంగా రుణాలు ఇస్తామని, ఖాతాదారులు సలహాలు, సూచనలు అందిస్తూ, బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ కేఈ హరికృష్ణ, కోదాడ బ్రాంచ్ మేనేజర్ పి.వెంకటేశ్, ఖాతాదారులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలి

నూతనకల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ భక్తి బావాన్ని పెంపొందించుకోవాలని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తానంచర్ల శివారులోని గంగమ్మ తల్లి జాతరకు సోమవారం దిష్టి పూజ ప్రధాన గంపను మండలంలోని మాచనపల్లి గ్రామ యాదవులు ఊరేగింపుగా తీసుకువెళ్ల దిష్టి పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. యాదవ కుల పెద్దల కోరిక మేరకు చైర్మన్ గిరిధర్‌రెడ్డి దేవాలయానికి రూ.2లక్షలతో ప్రహరీ నిర్మించారు. ఈ కార్యక్రమంలో పూజారులు యాసారపు లింగయ్య, వేల్పుల లింగయ్య, బొల్క లింగయ్య, పసుల అశోక్‌యాదవ్, బండపల్లి సాగర్, బొల్క సైదులుయాదవ్, బొల్క గంగయ్య, ఎర్రయ్య, సందీప్, వెంకటయ్య, ఉప్పలయ్య, పిచ్చయ్య తదితరులు ఉన్నారు.

'ఉపాధి' కూలీల వేతనాలు పెంచాలి

కోదాడ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 'ఉపాధి' కూలీల వేతనాన్ని మూడో వంతు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఉపాధి' కూలీల కనీస వేతనాన్ని రూ.7లు పెంచడం అవమానించడమేనని అన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకుడు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, మిట్టగణుపుల ముత్యాలు, స్వరాజ్యం, జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పులుసు సత్యం, నారసాని వెంకటేశ్వర్లు, దోసపాటి బిక్షం, స్వరాజ్యం, షేక్ సైదా, బత్తుల రవి, ముత్తయ్య, చెన్నబోయిన వీరయ్య, జంపాల స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముడి పట్టాభిషేకం



సూర్యాపేటలోని వేదాంత భజన మందిరంలో శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వేదాంత భజన మందిరంలో సీతారామచంద్రస్వామి పట్టాభిషేకాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దరూరి సింగరాచార్యులు శ్రీరాముడి, సీతాదేవి, లక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేశారు. పట్టు వస్త్రాలతో అలంకరించి పట్టాభిషేకం చేశారు. అదేవిధంగా అలంకార్ థియేటర్ సమీపంలో, అంబేడ్కర్‌నగర్ శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయాల్లో పట్టాభిషేకాన్ని వైభవరంగా నిర్వహించారు. పట్టాభిషేక మహోత్సవంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, సురేఖ దంపతులు పాల్గొని స్వాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వర్‌రావు, ప్రేమలత, నకిరేకంటి రాజశేఖర్, హైమావతి, సోమ అశోక్, శోభ, కర్నాటి రవి, కుక్కడపు శ్రీనివాస్, సోమసుమన్, శంకర్, అర్చకుడు దరూరి రాఘవాచార్యులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ఆచరిస్తున్న ప్రపంచ దేశాలు

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ దేశాలు ఆచరిస్తున్నాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్‌లోని శ్రీవేదాంతభజన మందిరం దేవాలయంలో నిర్వహించిన శ్రీరాముడి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో మంచిని గ్రహించాలన్నదే రామాయణ పరమార్థమన్నారు. శ్రీరామరాజ్యాన్ని తలపించేలా కాంగ్రెస్ పాలన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ధరణిలో లోపం.. వారికి వరం

(5వపేజీ తరువాయి)

20 ఎకరాలు కబ్జాలో ఉంటే 4 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా పొందుతున్నారు.

భూభారతి చట్టం ఎప్పటి నుంచో..

ధరణిలో లోపాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను త్వరలో తీసుకురానుంది. రైతులు ఇబ్బందులు పడకుండా ఉండడానికి ఈ చట్టం తీసుకువస్తున్నారు. రిజిస్ట్రేషన్ల సమయంలో సంబంధిత మండల ఆర్ఐలు స్వయంగా భూమిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. దీంతో అక్రమాలకు చోటుఉండదు. అంతేకాక కబ్జాలో ఉన్న భూమిని కొలవడమే కాకుండా మ్యాప్ కూడా తీసుకురావాడానికి సన్నాహాలు చేస్తున్నారు. సాగులో ఎవరుంటారో వారికే రైతు భరోసా అందేలా చర్యలు తీసుకోనున్నారు. అయితే ఇప్పటికే పెద్దఎత్తున బోగస్ రిజిస్ట్రేషన్లు జరిగాయి. భూమి లేకున్నా రైతు భరోసా తీసుకున్నారు. వారిని గుర్తించి ప్రభుత్వం తిరిగి రైతుబంధు సొమ్మును రికవరీ చేయాల్సి ఉంది. లేకుంటే భూమి లేని వారికి సైతం రైతు భరోసా ఇవ్వాల్సి వస్తోంది. ప్రభుత్వ భూములను కూడా గుర్తించి వాటికి సరిహద్దులు పెట్టాల్సి ఉంది. పలు గ్రామాల్లో ప్రభుత్వ భూమే కాకుండా అటవీ భూమి కూడా కబ్జాలకు గురైంది. వాటని కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. ప్రధానంగా మట్టంపల్లి, మేళ్లచెర్వు మండలాల్లో ప్రభుత్వ భూమి అనేక చేతులు మారింది. వేల ఎకరాలు పట్టాలు చేసుకొని విక్రయిస్తున్నారు. దీనిపై పెద్దరభస కూడా జరిగింది. రెవెన్యూ అదికారులు కూడా సస్పెండ్ గురయ్యారు.

భూభారతి చట్టం ఇంకా రాలేదు

ప్రభుత్వం భూభారతి చట్టం ఇంకా తీసుకురాలేదు. ప్రస్తుతం ధరణి పోర్టల్ నడుస్తుంది. ఎవరైనా అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

● వేణుమాధవ్, ఆర్డీవో, సూర్యాపేట

పేదలకు అండగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్

అనంతగిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అండగా ఉన్నాయని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనంతగిరి మండలానికి చెందిన 62 మంది లబ్ధిదారులకు రూ.62.07లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కు లను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ హిమబిందు, మాస్క శ్రీనివాసరెడ్డి, నాయకులు గుర్ర పుల్లారెడ్డి, డేగ కొండయ్య, బాబునాయక్, హనుమంతుల వెంకటయ్య, నాగిరెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

సిబ్బంది కొరతతో ఇబ్బంది

(5వ పేజీ తరువాయి)

కాంటాలు, బస్తాల బాధ్యత, మిల్లులకు లారీల ఎగుమతులు, దిగుమతులు, ఆన్‌లైన్‌లో రిపోర్టు చేయడం లాంటి బాధ్యతలు చూసుకోవాల్సి ఉంటోంది. ట్రక్‌సీట్స్ సైతం సంఘబంధం నిర్వాహకులను వెంట తీసుకుని తేవాల్సిన వస్తోంది. సెంటర్‌లో ఏ తప్పు జరిగినా సెంటర్ ఇన్‌చార్జిదే బాధ్యత ఉంటోందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. గత వానాకాలం సీజన్‌లో ఓ కేంద్రంలో సీసీకి తెలియకుండా సంఘబంధం నిర్వాహకులు ఓ రైతుకు ధాన్యం తేకపోయినా బస్తాలను ఇచ్చారు, దీంతో సీసీపై వేటుపడింది. ఏఈవోలు తేమశాతం, రైతులా, వ్యాపారులా అని చూడడం, పట్టాదారు పాస్‌పుస్తకాలు చూడడం చేస్తున్నారు. గ్రామసంఘబంధం సంఘాల కమిటీ సభ్యులు మాత్రం కాంటాలు వేయడం ట్యాబ్‌లో ఎంట్రీ, బస్తాలు తీసుకురావడం, మిల్లులకు వెళ్లి దిగుమతి చేయించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా సెంటర్‌లో ఇబ్బంది తలెత్తితే రెవెన్యూ, ఎంపీడీవో, వ్యవసాయాధికారులు పరిశీలించడం వారివంతుగా వస్తోంది. సీసీలు, ఏఈవోలు, సంఘబంధం కమిటీ సభ్యులే కొనుగోలు కేంద్రాల్లో ప్రధాన భూమిక పోషిస్తున్నారు.

● హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో వరి పంటలను ఎక్కువ శాతం మిల్లులకు తరలిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న ఏఈవోలు, సీసీలు సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలలో ఆన్‌డ్యూటీలో విధులు నిర్వహించడానికి అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. వీరికి గతంలో అలవెన్స్‌లు సైతం ఇవ్వకపోవడంతో ఇక్కడికి రావడానికి ఇబ్బందిపడుతున్నట్లు ఓ అధికారి తెలిపారు.

సిబ్బంది కొరత లేకుండా చూస్తాం

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది కొరత లేకుండా చూస్తాం. మౌలిక వసతులు ఏర్పాటుచేసేలా నిర్వాహకులకు ఆదేశాలిచ్చాం. అవకతవకలకు పాల్పడితే సెంటర్ ఇన్‌చార్జిలే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

● అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ, సూర్యాపేట

సత్యనారాయణకు జీవన సాఫల్య ఉగాది పురస్కారం



జీవన సాఫల్య ఉగాది పురస్కారాన్ని అందుకున్న గడ్డం సత్యనారాయణ

తుంగతుర్తి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండంలోని బండ రామారం గ్రామానికి చెందిన గడ్డం సత్యనారాయణ జీవన సాఫల్య ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుమల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్యనారాయణకు పురస్కారాన్ని స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాను చేస్తున్న సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత అభినయ శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారుడు దరువు అంజనన్న, సాహిత్య అకాడమి కార్యదర్శి నామోజు బాలాచారి పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

పెన్‌పహాడ్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గోపీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని దోసపహాడ్ ప్రజలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాభరోసా, బెట్టింగ్, గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలను, బాలికలను ఆకతాయిలు వేధిస్తే షీటీం సెల్ నెంబర్ 8712686056 ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మురళీధర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ లింగయ్య, రామాంజనేయులు, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి ఎల్లయ్య, గోపయ్య,చారి, కృష్ణ, నాగార్జున, దోసపహాడ్ గ్రామస్థులు పాల్గొన్నారు.

సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్: మాజీ ఎమ్మెల్యే

కోదాడ, తుంగతుర్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ విమర్శించారు. సోమవారం కోదాడలోని ఆయన నివాసంలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్‌లో ఈ నెల 27న జరిగే పార్టీ ఆవిర్భావ రజితోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హైడ్రా పేరుతో పేదల జీవితాన్ని కాంగ్రెస్ నాశనం చేసిందన్నారు. హెచ్‌సీయూ భూములను కాపాడాలన్నారు. కాల్వలకు నీటిని విడుదల చేసి పైర్లను కాపాడాలని కోరారు. ముందుగా సిల్వర్ జూబ్లీ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే నయీం, తొగరు రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ తుంగతుర్తి మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండలంలోని తూర్పు గూడెం ఎక్స్‌రోడ్డు తండా, దేవునిగుట్ట తండాలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాములు గౌడ్, దుర్గయ్య, గునిగంటి యాదగిరి, క్రాంతి, మాజీ సర్పంచ్‌లు గుగులోతు వెంకన్న, విరోజి, వీరన్న, వెంకన్న పాల్గొన్నారు.



కోదాడలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భానుపురి నాగారం: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 11గంటల వరకు సూర్యాపేట టౌన్-2లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈఈ యశ్వంత్ తెలిపారు.

● నాగారం మండలంలోని 11కేవీ విద్యుత్ ఫీడర్లు మరమ్మతుల కారణంగా ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు నాగారం ఏఈఈ మహేంద్రకుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవాలయానికి రూ.10వేల విరాళం

హుజూర్‌నగర్: పట్టణంలోని కోదాడ రోడ్డులోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయానికి కాంగ్రెస్ నాయకుడు, దివంగత కోడి మల్లయ్య కుటుంబ సభ్యులు సోమవారం రూ.10వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడి పార్వతమ్మ, ఉపేందర్ పాల్గొన్నారు.

మంచినీటి డిస్పెన్సర్ బహూకరణ

ఆత్మకూర్(ఎస్): మండల పోలీస్‌స్టేషన్‌కు జిల్లా కాంగ్రెస్ నాయకుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి మంచినీటి డిస్పెన్సర్ బహూకరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డిని ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో బద్దం లింగారెడ్డి, ఏఎస్ఐ దస్తగిరి, హెడ్ కానిస్టేబుళ్లు సైరెడ్డి వీరారెడ్డి, మోహన్, లింగయ్య, నరేష్, రమేష్, మధురెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

తలంబ్రాలకు 10వ తేదీ వరకు గడువు

కోదాడ రూరల్: భద్రాచలం సీతారాముల కల్యాణానికి నేరుగా వెళ్లలేని భక్తుల కోసం ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా తలంబ్రాలను నేరుగా ఇంటి వద్దకు సరఫరా చేస్తున్నామని కోదాడ డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తలంబ్రాల కోసం కోదాడ ఆర్టీసీ డిపోలో రూ.151ను ఈ నెల 10వ తేదీ లోపు చెల్లించి బుక్ చేసుకోవాలన్నారు. తలంబ్రాల కోసం కార్గో డీఎంఈ 9154298696, నెంబర్లను సంప్రదించాలన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోదాడ రూరల్: చలివేంద్రాన్ని ఆర్టీసీ సిబ్బది, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు అన్నారు. సత్యఆజాదర్‌నగర్‌లోని సాయి సేవా సమితి ఆధ్వర్యంలో కోదాడ ఆర్టీసీ డిపోలో సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.నాగశ్రీ, సూపర్‌వైజర్లు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, కోలపూడి యోహాన్ కోరారు. సోమవారం పట్టణంలో రూ.60వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును భైరం వెంకయ్యకు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దయాకర్, రామకృష్ణ, సైదులు, కాంతయ్య, అశోక్ పాల్గొన్నారు.

9 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

హుజూర్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నటు యూత్ సభ్యులు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.20,116, ద్వితీయ బహుమతి రూ.10,116లతో పాటు బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కు రూ.1000లు, బెస్ట్ బౌలర్, బెస్ట్ కీపర్, బెస్ట్ క్యాచర్లకు రూ.1000లతో పాటు జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న జట్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

వాటర్ ఫిల్టర్ అందజేత

మునగాల రూరల్: మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన డాక్టర్ కేతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు సేవాసమితి ద్వారా రూ. 15వేల విలువైన వాటర్ ఫిల్టర్‌ను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చందా శ్రీనివాసరావు, వీరభద్రం, జోగయ్య, నాగేశ్వరరావు, నర్సిరెడ్డి, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

కోదాడ: పట్టణంలోని శ్రీరంగాపురంలో సోమవారం పట్టణ, సీసీఎస్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. సీఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ఇంట్లో పేకాడుతున్న ఇద్దరు జూదరులు గోపయ్య, గోపీలను అరెస్టు చేసి, నిందితుల నుంచి రూ.6,900లు, రెండు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.